వానొస్తే.. వణుకే!

- పాతనగరంలో శిథిలావస్థలో పలు గృహాలు
- ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు
- వర్షపు నీటిపై తేలియాడుతున్న మ్యాన్‌హోల్స్
- భయం గుప్పిట్లో రామకృష్ణా జంక్షన్, ప్రసాద్‌గార్డెన్స్, వెలంపేట, పూర్ణామార్కెట్, పెరికివీధి ప్రాంత ప్రజలు

వానొస్తే పాతనగర వాసులు భయంతో గజగజ వణికిపోతున్నారు. ఎందుకంటే ఈ ప్రాంతంలో అనేక పురాతన కట్టడాలు, గృహాలు ఉన్నాయి. అవన్నీ ఏ చిన్నపాటి వర్షం పడినా కూలిపోతున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు రామకృష్ణా జంక్షన్, ప్రసాద్ గార్డెన్స్, వెలంపేట, పూర్ణామార్కెట్, పెరికి వీధి, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాల ప్రజలు ఎప్పుడు ఏం అవుతుందో అని భయపడి పోతున్నారు. ఆదివారం అంబుసరంగు వీధిలో 18వ శతాబ్దం నాటి ఇల్లు కూలిపోయింది.



చెరువును తలపిస్తున్న పూర్ణామార్కెట్ రోడ్డు

దాబాగార్డెన్స్: చిన్నపాటి వర్షానికే దక్షిణ నియోజక వర్గం ముంపునకు గురవుతోంది. అలాంటిది వాయు గుండం.. అల్పపీడనం.. తుపాను కారణంగా కుంభవృష్టితో వర్షాలు కురిస్తే ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దశాబ్దాలుగా పాతనగరం ముంపునకు గురవుతూనే ఉంది. రామకృష్ణా జంక్షన్, ప్రసాద్ గార్డెన్స్, వెలంపేట, పూర్ణామార్కెట్, పెరికి వీధి, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాలే ఇందుకు నిదర్శనం. చిన్నపాటి వర్షం కురిసినా ఈ ప్రాంతాలన్నీ జలమయమే. కాస్త పెద్ద వర్షాలు కురిస్తే ఆయా ప్రాంతాలన్నీ చెరువులను తలపించేలా మునిగిపోతుంటాయి. ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించి నిద్ర లేకుండా గడపాల్సి వస్తుంది.

భయం గుప్పిట్లో..

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రామకృష్ణా జంక్షన్, ప్రసాద్ గార్డెన్స్, పండావీధి, వెలంపేట, పూర్ణామార్కెట్, పెరికివీధి, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, స్టేడియం రోడ్డు ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటున్నారు. ఈ ప్రాంతాల్లో వర్షం ధాటికి ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరుతోంది.

తేలియాడుతున్న మ్యాన్‌హోల్స్..

వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో గల మ్యాన్‌హోల్స్ తేలియాడుతున్నాయి. మరికొన్ని చోట్ల మ్యాన్‌హోల్స్ వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ఈ ప్రాంత ప్రజలు అడుగు వెయ్యాలంటే భయపడుతున్నారు. వాహన చోదకులు భయంతో డ్రైవ్ చేస్తున్నారు. ముఖ్యంగా రామకృష్ణా జంక్షన్, 75 ఫీట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గల మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి.



రామకృష్ణా జంక్షన్ 75 ఫీట్ రోడ్డులో మ్యాన్‌హోల్ దుస్థితి

శిథిలావస్థలో పలు గృహాలు..

తుపాను, వర్షాల కారణంగా పాతనగర వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అనే భయం గుప్పిట్లో నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న కుంభవృష్టికి పాత నగరంలో పలు పాత ఇళ్లు తడిసి ముద్దయ్యాయి. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను ఆ ఇంటి యజమానులు కూల్చకుండా ఉంచేయడంతో ఆ ఇళ్లలో అద్దెకు ఉంటున్న వారు ప్రమాదపుటంచుల్లో భయాందోళనలో ఉన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసినా స్పందించడం లేదంటూ అధికారులే చెబుతున్నారు. గత ప్రభుత్వాలు నిర్మించిన స్కీం ఇళ్లతో పాటు వాంబే గృహాలు కూడా పెచ్చులూడుతున్న సందర్భాలున్నాయి. చిన్న వర్షం కురిసినా వారంతా బిక్కుబిక్కుమంటున్నారు. ముఖ్యంగా పాతనగరంలో కోటవీధి, పాత పోస్టాఫీస్, అంబుసరంగువీధి, చాగంటివారి వీధి, థామ్సన్ స్ట్రీట్, రెల్లివీధి, చిలకపేట, పద్మానగర్, తారకరామ కాలనీ తదితర ప్రాంతాల్లో పలు గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. తాజాగా అంబుసరంగు వీధిలో ఆదివారం తెల్లవారు జామున పురాతన గృహం కూలిపోయింది.



ప్రమాదపుటంచుల్లో పాతనగరంలోని ఓ ఇల్లు

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తులు వర్షాలకు ఇబ్బంది పడకుండా ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు ఆదివారం 28వ రోజుకి చేరాయి. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు అమ్మవారికి శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు పూజలో పాల్గొన్నారు. పరోక్షంగా పూజలు చేయదలచుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు జమచేసి వారి పేరు, గోత్రనామం, చిరునామాను 8985515989 వాట్సాప్ నంబర్‌కు పంపాలి. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వీవీ గిరికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వీవీ గిరి

దాబాగార్డెన్స్: గత 35 ఏళ్లుగా వివిధ హోదాల్లో చేసిన సామాజిక సేవకుగాను ముంబైలోని కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ విశాఖకు చెందిన డాక్టర్ విశ్వనాథ వెంకట (వీవీ) గిరికి ఆదివారం గౌరవ డాక్టరేట్ అందజేసింది. గిరి జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా, రోటరీ క్లబ్, మానవ హక్కుల సంఘం ద్వారా అనేక సేవలందిస్తున్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అనేక అవగాహన సదస్సుల్లో పాల్గొని, వినియోగదారులను జాగృతం చేయడంలో వీవీ పాత్ర ప్రముఖం. వీవీ గిరికి డాక్టరేట్ రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలి

సీతమ్మధార: రోడ్లపై ఎప్పటికప్పుడు చెత్త తొలిగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని వీఎంఆర్‌డీఏ సెక్రటరీ, జోన్ – 3 స్పెషల్ ఆఫీసర్ డి.కీర్తి ఆదేశించారు. ఆదివారం ఆమె జోన్ – 3 పరిధిలో పర్యటించారు. సీతమ్మధారలోని రైతుబజారు పక్కనే గల రోడ్డు, ఆక్సిజన్ టవర్స్ పక్కనే ఉన్న గెడ్డను పరిశీలించారు. కేఆర్‌ఎం కాలనీ, హెచ్‌బీ కాలనీ, రజక వీధి, కృష్ణా కళాశాల గెడ్డలతోపాటు పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేయాలని, దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గెడ్డల్లో చెత్త నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త డస్ట్‌బిన్‌లలో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆమెతోపాటు సీతమ్మధార తహసీల్దార్ ఎం.రమేష్, ఆర్ఐ ఇబ్రహీం, ఏఎంహెచ్‌వో దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజించండి



తాము తయారు చేసిన ప్రతిమలతో బాలలు

దాబాగార్డెన్స్: మట్టి గణపతితో రూపొందించిన విగ్రహాలనే ఉపయోగించాలని బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు పిలుపునిచ్చారు. బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, గ్రీన్ క్లైమేట్ సహకారంతో మట్టి వినాయక ప్రతిమల తయారీ ఉచిత శిక్షణ వర్క్‌షాపు ఆదివారం బాల వికాస్ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్, రంగులతో చేసిన బొమ్మల వాడకం హానికరమన్నారు. అవి వాతావరణాన్ని కలుషితం చేస్తాయని తెలిపారు. మట్టితో తయారు చేసిన ప్రతిమలనే వినియోగించాలని హితవు పలికారు. పలువురు బాలలు శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ ప్రతినిధులు జేవీ రత్నం, రాజేశ్వరి, బ్రహ్మకుమారీ రామేశ్వరి, సిద్ధు, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానంతోనే ఉపాధ్యాయులకు మేలు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

సీతమ్మధార: సీపీఎస్ వ్యతిరేక దినాన్ని పాటిస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ 2004లో ప్రవేశపెట్టిన సీపీఎస్ పథకాన్ని రద్దు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తూనే ఉన్నారన్నారు. గతంలో ప్రవేశపెట్టిన జీపీఎస్ పథకం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్రంలో మూడవసారి ఏర్పడిన మోదీ ప్రభుత్వం యూపీఎస్ పథకాన్ని అమలు చేయాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకమే అమలు చేయాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు ఎస్.విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధాలు ఆగితేనే ప్రపంచ శాంతి



జీవీఎంసీ గాంధీ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నిలిపేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నరసింగరావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆశీలమెట్ట, లలితా జ్యూయలర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, చేపల మార్కెట్, గుడివాడ విగ్రహం మీదుగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో సుదీర్ఘకాలం పాటు రెండు యుద్ధాలు కొనసాగుతున్నాయని, దీనికి ప్రధాన సూత్రధారి అమెరికా సామ్రాజ్యవాదమని విమర్శించారు. యుద్ధాలు ఆపి శాంతి నెలకొల్పాలన్నారు. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించిందన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కూడా ఆపాలన్నారు. ప్రపంచ శాంతి వర్ధిల్లితేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా నాయకులు పి.మణి, బి.జగన్, కుమార మంగళం, ఎం.సుబ్బారావు, జి.అప్పలరాజు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమ విశాఖ తరలి రావాలి



కంచర్లను సత్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా కంచర్ల అచ్యుతరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత, ఉపకార్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు, ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన కంచర్లను ఫెడరేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినా ఇంకా తెలుగు పరిశ్రమ తెలంగాణకే పరిమితం అయిపోయిందన్నారు. ఫలితంగా ఇక్కడ సినీ పరిశ్రమ ద్వారా వచ్చే ఆదాయం మొత్తం తెలంగాణకు వెళ్లిపోతుందన్నారు. సినీ పరిశ్రమ విశాఖకు తరలి రావాలని, ఇక్కడ ఫిల్మ్ చాంబర్ ఏర్పాటు చేయాలన్నారు. సెన్సార్ బోర్డుని కూడా ఇక్కడే నెలకొల్పాలన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలమైన పర్యాటక ప్రదేశాలని తెలిపారు. ముఖ్యంగా విశాఖ అందాల కోసం దర్శక, నిర్మాతలు ముందుకు వస్తున్నారని కంచర్ల పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు తోరం రాజా, ప్రధాన కార్యదర్శి అచ్యుతరామస్వామి, చెన్నా తిరుమలరావు, రాజేంద్ర ప్రసాద్, లక్ష్మీ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులపై పోలీసుల కొరడా



పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద చలనాలు రాస్తున్న ట్రాఫిక్ పోలీసులు

జగదాంబ: సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు 1వ తేదీ నుంచి వాహన చోదకులపై ఉన్న పాత చలనాలు చెల్లించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఎస్సై విశ్వనాథం ఆదివారం వాహన చోదకులను తనిఖీ చేశారు. పాత చలానాలు ఉన్న వారి నుంచి నగదు వసూలు చేసి రశీదులు అందించారు. హెల్మెట్ లేని వారిపై అపరాధ రుసుము విధించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు

అల్లిపురం: మీలో మార్పు వస్తే భవిష్యత్ బాగుంటుందని, హద్దు మీరితే నగర బహిష్కరణ తప్పదని రౌడీషీటర్లను మహారాణిపేట సీఐ వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు కష్టపడి పని చేసుకుంటూ బతకాలన్నారు. తమ పాత జీవితాన్ని పూర్తిగా వదిలిపెట్టాలని సూచించారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. ఎవరైనా తమ ప్రవర్తనలో పరివర్తన తెచ్చుకోకుంటే వదిలిపెట్టేది లేదన్నారు. ప్రతి రోజు మీ నడవడికపై నిఘా ఉంటుందని హెచ్చరించారు.

దుకాణాల అడ్డాగా బస్ షెల్టర్



సీతమ్మధార బస్‌షెల్టర్ వద్దనే వ్యాపారాలు

సీతమ్మధార: స్థానిక యూనియన్ బ్యాంకు వద్ద గల బస్ షెల్టర్ దుకాణాల అడ్డాగా తయారైందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరిలోవ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే 69వ నంబరు సిటీ బస్సులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ బస్ షెల్టర్‌లో ఇప్పటికే చెప్పుల దుకాణం వుంది. అలాగే పువ్వుల వ్యాపారి కూడా ఇక్కడ గొడుగు వేసి వ్యాపారం చేస్తున్నారు. ఇంకా ఉదయం, సాయంత్రం పలు తోపుడుబండ్లు కూడా ఇక్కడే పెట్టి వ్యాపారాలు చేస్తుంటారు. ఫలితంగా 69వ నంబరు సిటీ బస్సు ప్రయాణికులు దిగడం, ఎక్కడం ఇబ్బందిగా ఉంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ దుకాణాలకు వాహనాలపై వచ్చే వినియోగదారులు కూడా బస్ షెల్టర్ దగ్గరే వాహనాలు ఆపడంతో ట్రాఫిక్ నిలిచిపోతోందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎన్నికైన హెల్త్ ఎడ్యుకేటర్ల కార్యవర్గ సభ్యులు

మహారాణిపేట: విశాఖ జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఆదివారం విశాఖ జిల్లాలో హెల్త్ ఎడ్యుకేటర్ల ఆత్మీయ సమావేశం రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో పని చేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా పలాడ శివ ప్రసాద్ (తగరంపూడి పీహెచ్‌సీ), కార్యదర్శిగా సయ్యద్ బేగం (డీఎంహెచ్‌వో), కోశాధికారులుగా పి.సుబ్బలక్ష్మి, ఆర్.ఝాన్సీరాణి, ఉపాధ్యక్షుడిగా రామనాథం, జాయింట్ సెక్రటరీలుగా బి.మంగ, ఎస్.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక సభ్యులుగా డి.సత్యవతి, వి.రవి ఎన్నికయ్యారు.

విమ్స్ ప్రధాన ద్వారాల వద్ద నిఘా కరవు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేషెంట్లు, సిబ్బంది విజ్ఞప్తి



జాతీయ రహదారి వైపు సీసీ కెమెరాలు లేని విమ్స్ ప్రధాన ద్వారం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ప్రధాన ద్వారాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. రక్షణ చర్యల్లో భాగంగా విమ్స్ లోపల ఓపీ, క్యాజువాలిటీ, పరిపాలనా విభాగం తదితర చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అంత వరకు బాగానే ఉంది. ప్రధాన ద్వారాల వద్ద మాత్రం వాటి విషయం మరిచిపోయారు. జాతీయ రహదారి వైపు ఒక ప్రధాన ద్వారం, బీఆర్‌టీఎస్ వైపు మరో ప్రధాన ద్వారం ఉన్నాయి. ఈ రెండు ద్వారాల వద్ద సీసీ కెమెరాలు అవసరం. ఇటీవల కోల్‌కతాలో జరిగిన సంఘటనతో ఆస్పత్రుల్లో పటిష్టమైన రక్షణ చర్యలు అవసరమని వైద్య నిపుణులు కోరుతున్న విషయం తెలిసిందే. ఆస్పత్రుల్లో అన్ని చోట్లా రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలకు సూచిస్తున్నారు. విమ్స్‌లో పలుమార్లు రాత్రి వేళ బయటి నుంచి వచ్చిన వ్యక్తులు గొడవలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఐదు నెలల కిందట ఓ యువకుడు కత్తితో లోపలికి ప్రవేశించి నర్సింగ్ సిబ్బందిపై దాడి చేసి, హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. ఆ యువకుడు బీఆర్‌టీఎస్ ద్వారం నుంచి కత్తి పట్టుకుని లోపలికి ప్రవేశించాడు. సీసీ కెమెరాలు ఉండి ఉంటే వెంటనే గుర్తించి అలాంటి వారిని లోపల ప్రవేశించకుండా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడానికి వీలుంటుందని రోగులు, విమ్స్ సిబ్బంది చెబుతున్నారు.

‘టిడ్కో’ నివాసులకు నరకయాతన

- నాచుపట్టిన ట్యాంక్ నుంచే నీరు సరఫరా
- వీధుల్లో లైట్లు వెలగక అంధకారం
- అధ్వానంగా పారిశుధ్యం నిర్వహణ



చాకలిగెడ్డకు రక్షణ గోడ లేకపోవడంతో కాలనీలోకి చేరిన చెత్త, వ్యర్థాలు

కంచరపాలెం : తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్నట్లు... టిడ్కో ఇళ్లు నిర్మించి అర్హులకు అందజేసిన అధికారులు కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో నివాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. జోన్ – 5 పరిధి జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం ప్రాంతానికి చెందిన రాజీవ్‌కాలనీ, ముత్యమాంబకాలనీ టిడ్కో ఇళ్లకు సంబంధించిన సమస్యలను పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని స్థానిక నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది రాజీవ్‌కాలనీ, ముత్యమాంబ కాలనీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించారు. సుమారు 564 మంది పట్టాలు అందుకుని పండగ వాతావరణంలో ఇళ్లలోకి ప్రవేశించారు. ఆనాడు పట్టాలు అందించిన జోనల్ అధికారులు తర్వాత అటువైపు కన్నెత్తి చూడలేదు. మంచి నీటి సౌకర్యం, విద్యుత్ లైట్లు, పారిశుధ్యం సరిగా లేకపోవడంతోపాటు సీసీ రోడ్లు మట్టి రోడ్లను తలపించే విధంగా ఉండడంతో కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు.

తాగునీటిలో దోమల లార్వా...

రాజీవ్‌కాలనీ టిడ్కో ఇళ్లలో సుమారు 285 కుటుంబాలు నివసిస్తున్నాయి. జీవీఎంసీ మంచి నీరు సరఫరా చేసే వాటర్ ట్యాంక్ పూర్తిగా నాచుపట్టి ప్రమాదభరితంగా మారింది. ట్యాంక్‌ను శుభ్రపరచకపోవడంతో నాచుపట్టడం, దోమలు లార్వా, గుడ్లు నీటిపై తేలుతున్నాయి. కాలనీ ప్రజలు కుళాయిలు పట్టేటప్పుడు నీటి ద్వారా దోమల లార్వా వస్తోందని... బిందెలు, బకెట్లు, బాటిళ్లలో పట్టి అధికారులు వచ్చేటప్పుడు చూపించేందుకు జాగ్రత్తగా భద్రపరిచామని వాపోతున్నారు. ఫ్రై డే – డ్రై డే నిర్వహణకు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించే సిబ్బందికి నాచు, లార్వా చూపించినా పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు.




కాలనీలో బురద రోడ్లను తలపిస్తున్న సీసీ రోడ్డు

ప్రపంచ తెలుగు సదస్సుకు సన్‌మూర్తికి ఆహ్వానం

దాబాగార్డెన్స్: ప్రముఖ సామాజిక విశ్లేషకుడు, రచయిత సన్‌మూర్తికి నవంబర్ 22, 23 తేదీల్లో ఖతార్ రాజధాని దోహాలో నిర్వహించనున్న 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు ఆహ్వానం లభించింది. ఆంధ్ర కళావేదిక (దోహా), అమెరికా తెలుగు సాహిత్య వేదిక, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంయుక్త నిర్వహణలో జరిగే తెలుగు సదస్సుకు అధ్యక్షుడు వెంకప్ప భాగవతుల ఆహ్వాన పత్రాన్ని పంపారు. అనేక రచనలు చేయడంతో పాటు వివిధ డాక్యుమెంటరీ చిత్రాలు నిర్మించిన సన్‌మూర్తికి సదస్సులో పాల్గొనే అవకాశం రావడం పట్ల విశాఖ రచయితలు, కళాకారులు అభినందనలు తెలిపారు. గతంలో ఢిల్లీ తెలుగు అకాడమీ అవార్డుతో పాటు రాష్ట్ర ప్రభుత్వ యువజన అవార్డు, నెహ్రూ యువ కేంద్రం అవార్డు, అంతర్జాతీయ స్థాయిలో బ్యాంకాక్‌లో ఉత్తమ లీడర్‌షిప్ అవార్డుతో పాటు పలు అవార్డులు సన్‌మూర్తి అందుకున్నారు.

గుడ్లవల్లేరు కాలేజీ ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

బీచ్‌రోడ్డు: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలోని విద్యార్థినుల హాస్టల్ బాత్‌రూమ్‌ల్లో రహస్య కెమెరాలు ఏర్పాటు చేయడంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 300 మంది విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించారని, అవి సోషల్ మీడియాలో ప్రచురించారని చెబుతున్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలన్నారు. దీనికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో హిడెన్ కెమెరాలపై తనిఖీలు చేయాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఫుడ్ పాయిజన్ వల్ల 60 మంది ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన నేపథ్యంలో.. ఆ ఘటనపైన చర్యలు తీసుకోవాలని కోరారు.